# ది బ్లడీ ఫెలో



సంతోష్‌కుమార్ స్పెషలాఫీసరుగా వచ్చాడు.

వచ్చిన మూడోనాడే ఆఫీసంతా తనిఖీ చేశాడు. అందరి సీట్ల దగ్గరకూ వెళ్ళి, వాళ్ళ సొరుగుల్లో దాచుకున్న కాగితాలన్నీ బయటికి లాగి, వాటిగురించి సంజాయిషీ అడిగితే, వెర్రిమొహం వేశారు. ఒకణ్ణి డిస్మిస్ చేశాడు, ఇద్దర్ని సస్పెండుచేశాడు. ముగ్గురికి మూడేసేళ్ళు ఇంక్రిమెంట్లు ఆపేశాడు. నలుగురికి రికార్డు పాడు చేశాడు. అయిదుగురికి వార్నింగులిచ్చాడు. ఆరుగుర్ని కన్నెర్రచేసి చూశాడు.

అందరికీ బి. పి. పెరిగిపోయింది. గుండె గ్రాండ్ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లా దడ దడలాడింది. గంట కొట్టాడంటే చాలు, ఎవడ్నిపిలుస్తాడోనని ఉలిక్కిపడుతున్నారు. పిలిచినవాడికి కంటివెంట నీరేగాని, నోటి వెంట మాట రావటం లేదు. సాయంత్రం అయ్యేటప్పటికీ అందరికీ మలేరియా జ్వరం వచ్చినట్లు వొళ్ళు కాలిపోతోంది. ఏడయినా, ఎనిమిదయినా ఇంటికెళ్ళటా నికి ఎవడికీ గుండె చాలటం లేదు. ఊరు సద్దుమణిగిందిగదాని ధైర్యంచేసి ఇంటి కెళ్ళి, నాలుగు మెతుకులు గతికి, కాంతా మణి కౌగిట్లో కాస్త కునుకు తీద్దామనుకునే సరికి జవాను దబదబా తలుపుబాది 'పెసలా పీసరుగారు పిలుత్తున్నారండి" అని కేకేసి నట్లు అనిపించి, నిద్దరలో నడిచివెళ్ళు తున్నారు. కొందరు.

రెండు మూడు నెలలు అయ్యాక సంతోషకుమార్‌గారి శివతాండవం కాస్త తగ్గాక, ఒక్కొక్కరే ఉదయం, సాయంత్రం వారి ఇంటికి వెళ్ళి దర్శనం చేసుకొని, ఉడతా భక్తిగా తమ కానుకలు సమర్పించుకుని, వారి కరుణా కటాక్ష వీక్షణాలకోసం పాటుబడుతూ, పోటీ బడుతూ ఉండిపొయ్యారు. ఒకడు పొద్దునే వెళ్ళి బియ్యపు బస్తా వేయించేవాడు. మరొకడు కూరలు తెచ్చేవాడు, మరొకడు వారి కుర్రాళ్ళకు ట్యూషన్ చెప్పేవాడు, వేరొకడు వారి పెరట్లో గార్డెనింగ్ చేసేవాడు, ఒకడు బూట్ పాలిష్ చేస్తే, ఒకడు మస్కా-పాలిష్ చేసేవాడు. సంతోషకుమార్ మౌనం వహించడంతో, ఇదే వరస కని పెట్టి మొదలుపెట్టారు. ఆయన మేడ దిగు తుండగానే "రాజరాజాధిరాజ, మార్తాండ తేజ"తో మొదలై, రాత్రి పదకొండుగంట లకు, "ఏయ్. వినరా భారత వీరకుమార, విజయుని చరితంబు"తో రోజు పూర్త య్యేది.

చెదలు పట్టని నిప్పులాంటి మనిషి సంతోష్‌కుమార్‌ను మాజీ చైర్మన్ మధు సూదనరావు గారు పట్టేశారు. చేతిలో చిక్కాడనుకున్నాక; చిన్నగా పురి ఎక్కించాడు. ఎంతమంది వచ్చినా సిటీ సంగతి పట్టించుకోవటం లేదనీ, సంతోష కుమార్ గారి హయాంలో సిటీ మారి పోవాలనీ మాలతీదేవి పబ్లిక్ మీటింగ్ ల్లోనూ, ప్రయివేటు మీటింగుల్లోను చెబు తూనే వచ్చింది. పొగడ్తలు తనకు గిట్ట వనుకునే సంతోషకుమార్ తనకు తెలియ కుండానే, నీళ్ళల్లో నానిన శనగ గింజలా ఉబ్బిపోయ్యాడు.

మాలతీదేవిని పక్కన కూర్చోబెట్టు కుని, ఏవేంచేస్తే అందం పెరుగుతుందో చెప్పమని ఊరంతా తిప్పాడు. సంతోష్ కుమార్‌ను సంతోషపరిచి, నగరంలో ఉన్న పాతపేట మురికివాడను తీసేయించా లని కోరింది. వెంటనే జీపులో వెళ్ళి చూశారు.

జీపును పాతపేట తీసుకువెళ్ళమన్న ప్పుడు డ్రైవరు వెంకటాద్రి నిజంగా సంతోషించాడు. వాడు వుంటున్న ఇల్లు పాతపేటలోనే ఉంది. ఇన్నాళ్ళకు తన దొరగారిని కారులో తీసుకుని తన ఇంటి ముందుకు వెళ్తున్నందుకు వాడి సంతోషా నికి పట్టపగ్గాల్లేవు.

స్పెషలాఫీసరు గారు, మధుసూదన రావుగారు, మాలతమ్మగారు వాళ్ళ గుడిసెల మధ్య తిరిగి, ఇంగ్లీషులో ఏవేవో మాట్లాడుకున్నారు. డ్రైవరు వెంకటాద్రి తన వాడలోని వాళ్ళందరి వంక గర్వంగా

# శ్రీరంగం నారాయణబాబు

(నాస్తి ఏషాం యశఃకాయే జరా-మరణమ్ భయమ్)

సంజ్ఞ సరిహద్దున, లోయాంచల లోయలోన, నీడలు కూడేచోట
గడియారపు ముండ్ల జంట కడపటి కౌగిలిలో
మత్తిలి మసకవాడే చోట
అగణిత గణిత - చిహ్నాలు ఆకాశపు శాఖలపై పొంచి —
చంక్రమించేచోట
వివేకపు విరిగిన గద్దెపైన, అరాచకపు రాచరికాన,
తలక్రిందుగ తపస్సు చేస్తున్నవాడు
జాడీ బీడీల చండహోమ - ధూమ - కుండలిలోంచి
ఖండిత ఖడ్గ - మృగాల, గండర గండ - భేరుండాల
చూస్తున్నవాడు
ఆకలిని మోస్తున్నవాడు!
భూతా భూత - జ్యోతిష్కుడు, సంతతాన్య చేతస్కుడు
అతడే ఊర్ధ్వ రేతస్కుడు హర్షామర్షాలులేని మహర్షి.
ఉద్గ్రంథాలు తలదిండ్లుగ నాడు - నేడు క్రీడించిన చింకి చాప
అప్సరసల సవాయి హాయి, స్వాప్నిక సంయోగాల స్వేద
దుర్భర - జాగరణాలు
కాశీమజిలీల కథల రాశీభూత - సురతశ్రమలు
పౌరాణికపు పయోరియాను ఊసీ బోసినోట కదిలే—
కవితాక్రిములు.
ఎండిన ఇసుకపైన కోరిక కుంటిచేప
అంతరంగపుటరల్లో ఉపనిషత్తులు, మార్క్సు, ఫ్రాయిడ్
వాత్స్యాయనుడు, హేవలక్ ఎల్లిస్,
లీలావతి, ఐన్‌స్టీన్, కాళిదాసు, జేమ్సు జాయిస్
ఆదిమనిషాదుని విషాదానికి బీట్‌నిక్కుల నిషాతోడు
అవచేతనపు ఎక్సరేలో అయోడిపస్ కాంప్లెక్సు
గర్భకోశపు ద్విపటిలో, తల్లివంటి చీకటిలో
స్వరతి - నిరతబాలకుడు, దోష - కశాచాలితుడు,
అతని మనసు క్యూబిష్టు బాబిలోను
వెర్రిపీరులు, శివలింగాలు, సిందూర చర్చిత శిలలు
రక్తాంబర — ధారుడతడు, రక్తాక్షుడు. ఆదిశక్తికి-ఆరాధకుడు
దీపితశ్మశానంలో కవితా - శవ- సాధనచేస్తున్నాడు
ఝుల్లుమనే కంకాళీలు, ఘల్లుమనే కపాలాలు
గృహ్యతాంత్రిక గుహలలో భైరవ - మంత్ర - ప్రతి రావాలు
అగ్నిచుట్టూ నర్తించే దిగంబర శూలధారులు
ఆఫ్రికాలో అర్ధరాత్రి.
నిర్జనమానసాన అడుగుల సడి వడి వడి మ్రోగ
నీడల్లో ఒదిగి ఒదిగి వస్తున్నాడు నేరస్తుడు
హఠాత్తుగా సందు మలుపు తిరుగగానే
బుగ్గ మీసాల పత్తేదారు "హేండ్సు అప్" అని అరిచాడు.

(నారాయణబాబు పోయినపుడు చెప్పినది)

— బైరాగి

---

చూశాడు. వాళ్ళందర్నీ దింపి ఇంటికొచ్చాక, వెంకటాద్రిని వాళ్ళంతా నిలేసి అడిగారువిషయమేమిటని. వాడికీ నిజంగా ఏమీ తెలియదు. కానీ కోసేశాడు. తమ ఇళ్ళముందు రోడ్లు వేయిస్తున్నారని.

ఈ పాత పేటలో ముఖ్యంగా ఈ మురికివాడలోనివాళ్ళే మాలతమ్మకు వోట్లు వెయ్యలేదు క్రిందటిసారి. వీళ్ళవల్లే ఆమె ఓడిపోయింది. వీళ్ళను ఇక్కడి నుంచి తరిమెయ్యకపోతే; తన పేరు మార్చుకుంటానని ఆమె ఆనాడే శపథం చేసింది.

మర్నాడు రోడ్డు రోలర్లకు బదులుగా, బుల్‌డోజర్లు వచ్చాయి. రోడ్లమీద గాక, ఇళ్ళమీదకు వచ్చాయి. గుడిసెలన్నీ నేల మట్టం అయినాయి. వాళ్ళ ఆక్రందన, ఆర్తనాదాలు మాత్రం మిన్నుముట్టాయి. అడ్డం వెళ్ళిన వాళ్ళకు నడుములు విరిగాయి, లాఠీలతో తలలు పగిలాయి.

ఆ రాత్రే సంతోష్‌కుమార్‌కు తనను బదిలీ చేసినట్లు తెలిసింది. రేపో ఎల్లుండో ఆర్డర్సు రావచ్చు. ఈ ఊరిని, ముఖ్యంగా మాలతీదేవిని, వదిలిపోవటానికి సంతోష్ కుమార్‌కు చాలా బెంగగా ఉంది రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు. మసలటంతోనే సరిపోయింది,

ఎనిమిది గంటలకు నిద్రలేచి, ఒళ్ళు విరుచుకోబోతే చెయ్యి గోడకు తగిలి నెప్పి పుట్టింది. కాఫీ తాగుతూ, రేడియో తిప్పబోయేసరికి మళ్ళీ చెయ్యితగిలి, గాజు ఫ్లవర్‌వాజు క్రిందపడి పగిలిపోయింది. వెంకటాద్రిని పిలిచి గాజు పెంకులు ఎత్తి పారబొయ్యమన్నాడు. వెంకటాద్రి జాగ్రత్తగా ఎత్తి పారబోసి వచ్చాడు. ఈలోగా అరడజనుసార్లు నొచ్చుకున్నాడు నిక్షేపంలాంటి ఫ్లవర్‌వాజు పొద్దున్నే బద్దలయిపోయినందుకు.

"మీరీ ఫ్లవర్‌వాజు పగిలినందుకే అంతగా ఇదెపోతే, మా సంగతేంటి? మా ఇళ్ళు కూలిపోయాయి. బతుకులు బండలైపోయాయి. మేము ఏమై పోవాలి?" అని బయటపడి అడిగాడు వెంకటాద్రి.

"వెధవలు, వీళ్ళ ఏడుపే తనకు కొట్టింది" అని గొణుక్కున్నాడు.

"మా ఉసురు ఊరికేపోదు, బాబూ" అని మళ్ళీ అందుకున్నాడు వెంకటాద్రి.

"యూ, బ్లడీ ఫెలో...."అని లాగిపెట్టి కొట్టాడు సంతోష్‌కుమార్. వెంకటాద్రి చెంప పగిలిపోయింది. దాంతో వాడు ఏడు కొండల ఎత్తుకు ఎదిగిపొయ్యాడు.

"నాయాల, నన్ను కొడతావంటరా నువ్వు? మా ఇల్లు కూలకొడతావంటరా నువ్వు? ఏందిరా, అందంగా చేసేది నువ్వా నీ పేడిముహం- బట్టతల అందంగా వున్నాయంటరా? ఎవడి కంపు వాడికింపురా. మా బతుకులు మేం బతుకుతుంటే. నువ్వెవడివిరా మా కొంపలు కూల్చడానికి...." అని వెంకటాద్రి తన విశ్వరూపం చూపిస్తూ ఇనుప హస్తంలాంటి తనచేత్తో సంతోష్ కుమార్ బట్టతలమీద బలంగా కొట్టాడు.

సంతోష్‌కుమార్ ముందుకు వంగి వెంకటాద్రి పాదాలమీద పడ్డాడు. వెంకటాద్రి సంతోష్‌కుమార్ గొంతు మీద కాలేసి తొక్కాడు, ఆయనింక లేవలేదు

---

## బానిస తెలివి

యజమాని : నా ఓపిక నశించింది. నిన్ను బర్తరఫ్ చేస్తున్నాను.

నౌకరు : బానిసల్ని అమ్ముతారని విన్నాను కాని, బర్తరఫు చేస్తారన్న సంగతి నాకు తెలియదే!

## మానరక్షకుడు

అగ్నిమాపక దళంలో పనిచేసేవాడు : నేను పనిసార్లు, పదిమంది ఆడపిల్లలను రక్షించినా ఒక్క బహుమానం కూడా ముట్టలేదు.

మిత్రుడు : ఆశ్చర్యంగా వుందే?

అగ్ని : నేను రక్షించింది అగ్ని ప్రమాదం నుంచికాదు. మా ఆఫీసరు బారి పడకుండాను.

—జె. రాఘవేంద్రరావు, గుడివాడ